



ఎన్నికల షెడ్యూల్ ఇలా..

నోటిఫికేషన్ (నామినేషన్ల స్వీకరణ)	18 ఏప్రిల్
నామినేషన్ల దాఖలుకు గడువు	25 ఏప్రిల్
నామినేషన్ల పరిశీలన	26 ఏప్రిల్
నామినేషన్ల ఉపసంహరణ	29 ఏప్రిల్
పోలింగ్ తేదీ	13 మే
కౌంటింగ్, ఫలితాల వెల్లడి	4 జూన్

లోక్‌సభ ఎన్నికలకు మోగిన నగారా

- ఏప్రిల్ 18నుంచి నామినేషన్ల ఘట్టం
- మే 13న పోలింగ్
- జూన్ 4న కౌంటింగ్, ఫలితాల వెల్లడి
- అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం
- సమరానికి సై అంటున్న రాజకీయ పక్షాలు

లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలో మే 13న పార్లమెంట్ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుండగా, జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను ఏడు దశల్లో నిర్వహిస్తుండగా, నాలుగో దశలో రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలకు ఎన్నిక లు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని రెండో లోక్‌సభ స్థానాలకు మే 13న పోలింగ్ జరగనుంది. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 4, 129పోలింగ్‌స్టేషన్లలో ఈ ఎన్నిక నిర్వహించనున్నారు.నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో 17,18,954 మంది ఓటర్లు, భువనగిరి లోక్‌స భనియోజకవర్గంలో 17,98,704 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వెంట నే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యాక ఫలితాన్ని వెల్లడిస్తారు. అప్పటివరకు ఎన్నిక ల కోడ్ అమలులో ఉండటంతో ప్రభుత్వానికి సంబంధించిన అన్ని అధికారిక కార్యక్రమాలకు బ్రేక్‌పడింది.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

వెంటనే ఎన్నికల కోడ్

కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులోకి రావడంతో మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఉన్నతాధికారులు అభివృద్ధి కార్యక్రమాల ప్రా రంభాలు, శంకుస్థాపనలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. అధికారయంత్రాంగం యావత్తూ ఎన్నికల సంఘం పరిధిలోకి వచ్చింది. పోలింగ్ సిబ్బంది నియామకం, ఎన్నికల నిర్వహణ, పోలీస్ బందోబస్తుకు అవసరమైన బలగాలు సమకూర్చుకోవడం, ఈవీఎం యంత్రాలను సిద్ధం చేయడం వంటి పనులన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పోటీ చేసే అభ్యర్థులు రూ.90లక్షల వ్యయపరిమితికి లోబడి ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఓటర్లను ప్రభావితం చేసేలా, ప్రలోభపెట్టేలా ఏ రాజకీయపార్టీ, రాజకీయనేత, అభ్యర్థి వ్యవహరించకూడదు. ఎన్నికల ప్రసంగాల్లోనూ ప్రలోభానికి గురిచేసే హామీలివ్వకూడదు. అంతేకాకుండా కుల, మత వర్గీకరణలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, నేతలు, అభ్యర్థులు మాట్లాడే భాషపై నియంత్రణ ఉండాలని ఎన్నికల కమిషన్ సూచించింది.

సమరానికి సిద్ధమైన రాజకీయపక్షాలు

లోక్‌సభ ఎన్నికల్లో తలపడేందుకు రాజకీయపార్టీలు ఇప్పటికే సన్నద్ధమయ్యాయి. జిల్లాలోని రెండు సీట్లకు బీజేపీ భువనగిరి నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, నల్లగొండ నుంచి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థిత్వాలను ఇప్పటికే ప్రకటించి ఎన్నికల రణరంగంలో ముందంజలో ఉంది. కాంగ్రెస్ తొలి జాబితాలో నల్లగొండ లోక్‌సభ సీటుకు మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగా, భువనగిరి స్థానం నుంచి అభ్యర్థి ఎంపికకు తీవ్ర కసరత్తు చేస్తోంది. బీఆర్ఎస్ ఇప్పటివరకు జిల్లాలోని రెండు సీట్లకు అభ్యర్థులను ప్రకటించలేదు. నేడో రేపో ఆ పార్టీ అభ్యర్థుల్ని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో స్థిరమైన ఓటు బ్యాంకు ఉన్న సీపీఎం ఈ లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి స్థానం నుంచి పోటీ చేస్తుందని, త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య తెలిపారు. బీఎల్ఎఫ్ ఇప్పటికే తమ అభ్యర్థులుగా వస్కుల మట్టయ్య, నూనె వెంకటస్వామిని ప్రకటించింది. సీపీఐ, తెలంగాణ జనసమితి పార్టీలు కాంగ్రెస్‌తో పొత్తులో ఉండడంతో ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లలో ఆ పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచే అవకాశం లేదు. బీఎస్పీ తదితర పార్టీలు అభ్యర్థులను నిలబెట్టే అంశంపై సమాలోచనలు చేస్తున్నాయి.

నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం

అసెంబ్లీ నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జండర్	మొత్తం
నల్లగొండ	284	1,20,556	1,27,109	57	2,47,722
దేవరకొండ	308	1,31,599	1,30,241	18	2,61,858
నాగార్జునసాగర్	299	1,15,545	1,20,229	21	2,35,795
మిర్యాలగూడ	263	1,15,352	1,19,956	26	2,35,334
హుజూర్‌నగర్	308	1,21,390	1,28,692	17	2,50,099
కోదాడ	296	1,19,295	1,25,889	17	2,45,201
సూర్యాపేట	271	1,18,510	1,24,422	13	2,42,945
మొత్తం	2029	8,42,247	8,76,538	169	17,18,954

భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం

అసెంబ్లీ నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జండర్	మొత్తం
భువనగిరి	257	1,08,598	1,11,358	1	2,19,957
ఆలేరు	309	1,16,344	1,17,497	19	2,33,860
నకిరేకల్	305	1,25,005	1,27,625	3	2,52,633
తుంగతుర్తి	326	1,28,240	1,29,752	7	2,57,999
మునుగోడు	307	1,27,547	1,28,513	3	2,56,063
జనగామ	277	1,18,929	1,22,207	9	2,41,145
ఇబ్రహీంపట్నం	319	1,69,713	1,67,298	36	3,37,047
మొత్తం	2100	8,94,376	9,04,250	87	17,98,704

ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు ఉమ్మడి జిల్లా అధికారిక యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ దాసరి హరిచందన వ్యవహరిస్తుండగా, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా కలెక్టర్ హన్మంతు కేజండగే వ్యవహరిస్తున్నారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో విస్తరించి ఉండగా, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగామ జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. నల్లగొండ నియోజకవర్గం పరిధిలో 2,029 పోలింగ్ స్టేషన్లకు 17,18,954 మంది ఓటర్లు ఉన్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 2,100 పోలింగ్‌స్టేషన్లకు 17,98,704 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా సవరణ, మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ వరకు గడువు ఉండడంతో ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

కోడ్ కూసింది

83 రోజులపాటు పార్లమెంట్ ఎన్నికల కోడ్

- నిలిచిపోనున్న అభివృద్ధి పనులు
- 239 రోజుల్లో 138 రోజులు ఎన్నికల కోడ్



ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భువనగిరి టౌన్, మార్చి 16: ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. శనివారం ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించిన వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ జిల్లాలో 83 రోజుల పాటు కొనసాగనుంది. ఈ మేరకు మార్చి 16న నుంచి ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు 83 రోజులపాటు అమల్లో ఉండనుంది. దీంతో అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడనుంది. అయితే ఈపాటికే ప్రారంభమైన పనులను యథావిధిగా కొనసాగించే అవకాశం ఉన్నప్పటికీ నూతన పనులను ఎన్నికల కోడ్ ముగిసే వరకు చేపట్టే అవకాశం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఐదు గ్యారంటీ పథకాలను అమలుచేయగా మరిన్ని పథకాలను అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఆగాల్సిందే. అలాగే మునిసిపల్ అవిశ్వాస రాజకీయాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు మునిసిపాలిటీల్లో ఇటీవల కొలువుదీరిన నూతన పాలకవర్గాలు పలు పనులను ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికీ ఎన్నికల కోడ్‌తో బ్రేక్‌పడింది. కాగా గత అక్టోబరు 9న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌తో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ డిసెంబరు 5వరకు కొనసాగిన విషయం తెలిసిందే. దీంతో గత అక్టోబరు 9న ప్రాంభమైన ఎన్నికల కోడ్ నుంచి పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసే 2024 జూన్ 6 వరకు 239 రోజుల్లో 138 రోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నట్లవుతోంది. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో జనగాం నుంచి గెలుపొంది ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన పట్టభద్రుల ఎమ్మెల్సీకి పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఎన్నికల కమిషన్ ఎన్నిక నిర్వహించనుంది. ఈపాటికే ఓటరు జాబితాలు కూడా సిద్ధమయ్యాయి. దీంతో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మరోమారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రానుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మొదటి రోజు శనివారంనుంచే భువనగిరి పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీని ప్రారంభించగా గోడలపై ఉన్న పార్టీల గుర్తులను, పార్టీ పేర్లను తూడ్చడాన్ని అధికారులు ప్రారంభించారు. నాయకుల విగ్రహాలకు, అభివృద్ధి పథకాల శిలాఫలకాలకు ముసుగులు వేస్తున్నారు.

ఎన్నికల వరకు 'ప్రజావాణి' రద్దు : కలెక్టర్

నల్లగొండ టౌన్,మార్చి 16: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని ఈనెల 18న నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు (జూన్ 6వతేదీ) 'ప్రజావాణి' ఉండదని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు.

సెక్టోరల్ అధికారులు సమర్థంగా విధులు నిర్వహించాలి

నల్లగొండ టౌన్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సెక్టోరల్ అధికారులు తక్షణమే వారికి కేటాయించిన సెక్టర్‌కు సంబంధించిన మ్యాపింగ్‌ను రూపొందించాలని, సమర్థంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో సెక్టోరల్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెక్టోరల్ అధికారులు వారి సెక్టార్‌కు కేటాయించిన పోలీసు అధికారులతో కలిసి సంయుక్తంగా గ్రామాలను సందర్శించి మంగళవారంలోపు మ్యాపింగ్ పంపించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

నల్లగొండ టౌన్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికలకు కేంద్ర ఎన్నిక ల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసినందున ఎన్నికల నిర్వహణకు కలెక్టర్లు, ఎస్పీలు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నిక ల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున తక్షణమే పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు, వివిధ రకాల ప్రచార సామగ్రీలు తొలగించాలన్నారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. జిల్లాస్థాయి ఫిర్యాదుల కమిటీ తక్షణమే పని ప్రారంభించేలా చూడాలని, నివేదికలను ఎప్పటికప్పుడు పంపించాలని, ఎన్నికలకు సంబంధించి తప్పనిసరిగా రూపొందించే సామగ్రిపై దృష్టి సారించాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటుతోపాటు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీములు తక్షణం పని ప్రారంభించాలని ఆదేశించారు. 'సువిధ' ద్వారా ఇచ్చే అన్ని అనుమతులకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు సీఈవోలు లోకేష్‌కుమార్, సర్ఫ్‌రాజ్ అహ్మద్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పలు సూచనలు చేశారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనాదీప్తి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల ప్రధాన అధికారి

త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

జడ్పీచైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 16: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. జిల్లా సమగ్రా అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో నకిరేకల్ నుంచి గురజాల రోడ్డుకు రూ.5లక్షలు, నార్కట్‌పల్లి రోడ్డుకు రూ.16 కోట్లు మంజూరు చేశామన్నారు. ఆర్‌అండ్‌బీ కార్యాలయ నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లా విద్యాధికారి భిక్షపతి మాట్లాడుతూ, 'మన ఊరు, మన బడి'కి సంబంధించి 1,484 పాఠశాలలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. తిప్పర్తి జడ్పీటీసీ పాశం రాంరెడ్డి మాట్లాడుతూ, డీ-39, డీ-40 కింద తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతు న్నాయని, దీన్ని అధికారులు త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై అధికారులు స్పందిస్తూ ఏప్రిల్ 20 వరకు ఉదయ సముద్రంలో సరిపడా తాగునీరు ఉందన్నారు.పెద్దవూర జడ్పీటీసీ మాట్లాడుతూ, గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నందున నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో జడ్పీవైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, సీఈవో ప్రేమకరణ్‌రెడ్డితో పాటు వివిధ స్థాయి సంఘాల చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ టౌన్, మార్చి 16: కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకొని రాజీకి అర్హమైన కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలన్నారు. కాగా జాతీయ లోక్‌అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 123 సివిల్ కేసులు, 4,991 క్రిమినల్ కేసులు, 1,26,165 ప్రిలిటిగేషన్ కేసులు, మొత్తం 1,29,279 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి, జిల్లా మొదటి అదనపు జడ్జి బి.తిరుపతి, జి.సంపూర్ణఆనంద్, జిల్లా రెండో అదనపు జడ్జి డి.దుర్గప్రసాద్, జిల్లా మూడో అదనపు జడ్జి కె.కవిత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి నాగరాజు

పంతాలతో పతనం కావొద్దు : జిల్లా అదనపు జడ్జి వేణు

మిర్యాలగూడ లీగల్: పంతాలకు పోయి జీవితాన్ని పతనం చేసుకోవద్దని, చేసిన తప్పులను పశ్చాత్తాపంతో సరి చేసుకుంటే జీవితం బంగారమయమవుతుందని జిల్లా ఐదో అదనపు జడ్జి జి.వేణు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పులను సరిచేసుకోని, భేషజాలకు పోకుండా కేసులను రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి విలువైన జీవిత కాలాన్ని వృథా చేసుకోకుండా, ఆ సమయాన్ని కుటుంబానికి కేటాయించాలన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్ మాట్లాడుతూ, లోక్‌అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మొదటి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు సుమబాల, అపూర్వరవళి, బార్ అసోసియేషన్ కార్యదర్శి వాకిటి శ్రీనివాస్, డీఎస్పీ రాజశేకర్‌రాజు, లోక్‌అదాలత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, లోక్‌అదాలత్‌తో 663 కేసులు పరిష్కరించినట్టు జడ్జీలు జి.వేణు, సుజయ్, సుమబాల, అపూర్వరవళి తెలిపారు. అందులో పెట్టీ కేసులు 574, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 33, సివిల్, క్రిమినల్ కేసులు 56 ఉన్నాయన్నారు.

పదవులు కాదు అభివృద్ధే ధ్యేయం


మాజీ మంత్రి జానారెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి

గుర్రంపోడు మార్చి 16: తనకు పదవులు ముఖ్యం కాదని, జిల్లా సమగ్ర అభివృద్ధే ధ్యేయమని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం తన పాత్ర అగ్రస్థానంలో ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘ కాలం మంత్రిగా పని చేసిన రికార్డు తనదేనన్నారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా తననే పోటీ చేయాలని పార్టీ కోరినప్పటికీ, ప్రజల ఆకాంక్ష మేరకు తన కుమారుడు పోటీ చేస్తున్నాడని వివరించారు. అహంకారం, అవినీతితో పాలన సాగించిన కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ కేవలం గుడిపేరు చెప్పి బడులను మూసివేస్తున్నాడని విమర్శించారు. పేదలకు రూ.15లక్షలు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. ధరణి లోపాలు సరిచేసి అర్హులైన వారికి భూ హక్కులు కల్పిస్తామన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు నిర్వహిస్తోందన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తానన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్, నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, చనమల జగదీశ్వర్‌రెడ్డి, గాలి రవికుమార్, కుప్ప రాములు, సర్వయ్యయాదవ్, జాల చినసత్తయ్యయాదవ్, సైదిమియా, వడ్డెగోని యాదగిరిగౌడ్, అనుముల తిరుమలయ్య, తదితరులు పాల్గొన్నారు.



సింహరూఢుడిగా నృసింహుడు, గోవర్ధన గిరిధారి అలంకారంలో స్వామివారు

భక్తవత్సలా.. పాహిమాం

- వైభవంగా తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు
- ఉదయం గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నృసింహుడు
- సాయంత్రం సింహరూఢుడిగా తిరువీధుల్లో విహారం

మహిమాన్విత దివ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనాథుడు శనివారం 'గోవర్ధన గిరిధారి'గా దర్శనమివ్వగా, సాయంత్రం సింహరూఢుడిగా తిరువీధుల్లో ఊరేగించారు.

• 7లో..

● కవిత అరెస్ట్‌పై బీఆర్ఎస్ నిరసన



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసనలు, ఆందోళనలు నిర్వహించారు.

• 8లో..

కస్టమ్ మిల్లింగ్ లక్ష్యాన్ని పూర్తి చేస్తాం

నల్లగొండ టౌన్, మార్చి 16: వానాకాలానికి సంబంధించి 2023-2024 కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను వేగవంతం చేసి లక్ష్యాన్ని సాధిస్తామని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తెలిపారు. శనివారం రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 2023-24 వానాకాలం సీఎంఆర్‌లో మిగిలిన 2.759లక్షల మెట్రిక్ టన్నులను వేగవంతం ఎఫ్‌సీఐకి పంపించాలని ఆదేశించారు. అందుకుగాను ప్రతీ రోజు 3000 మెట్రిక్ టన్నులు లక్ష్యంగా తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


తప్పతాగి.. ఇంటికి నిప్పుపెట్టి

- తల్లిపై దాడి
- అడ్డుకున్న స్థానికులకు బెదిరింపు

ఆత్మకూర్(ఎస్), మార్చి 16: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని తల్లిపై దాడికి యత్నించాడో కుమారుడు. ఆమె తప్పించుకోవడంతో కోపంతో ఇంట్లోని దుస్తులకు నిప్పంటించి, ఇల్లు తగులబెట్టాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిలుకూరి బాలయ్య, ఉప్పలమ్మల కుమారుడు విక్రమ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా వివాహం కాలేదు. తండ్రి బాలయ్య చర్చి పాస్టర్ కాగా, ఉప్పలమ్మ కూలిపనులు చేస్తుంది. మద్యానికి బానిసైన విక్రమ్ మద్యం డబ్బుల కోసం తరుచూ తల్లిదండ్రులను వేధించేవాడు. విక్రమ్ రెండు రోజులుగా మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లిని వేధిస్తున్నాడు. శనివారం కూడా డబ్బులు ఇవ్వాలని తల్లిపై దాడికి యత్నించగా ఆమె తప్పించుకుంది. ఆ కోపంతో మద్యం మత్తులో ఉన్న విక్రమ్ తన ఇంట్లోని బీరువాలో తల్లి దుస్తులు తీసి తగలబెట్టి తలుపులు పెట్టాడు. ఆ మంటలు ఇంటికి అంటుకొని ఇంట్లో సామానుతో పాటు దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు రాగా విక్రమ్ గ్రామస్థులను బెదిరించాడు. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న సామాన్లు, దుస్తులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఇంటి నుంచి మంటలు రావడంతో విక్రమ్ అక్కడినుంచి పారిపోయాడు.



ఇంటి నుంచి వస్తున్న మంటలు







భక్తవత్సలా.. పాహిమాం

● లక్ష్మీనృసింహుడి సన్నిధిలో వైభవంగా తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ● ఉదయం గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నృసింహుడు ● రాత్రికి సింహారూఢుడిగా తిరువీధుల్లో విహారం

యాదగిరిగుట్ట, మార్చి 16: మహిమాన్విత దివ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనాథుడు నృసింహుడు శనివారం 'గోవర్ధన గిరిధారి'గా శ్రీకృష్ణుడి అలంకరణలో పెళ్లి కొడుకుగా సేవలు అందుకోగా భక్తులు దర్శించుకుని తరించారు. ప్రధానాలయ ప్రాకార మండపంలో స్వామివారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా గోవర్ధనగిరిధారి అలంకరణలో తీర్చిదిద్దిన సేవలో అధిష్ఠింప జేశారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధానాలయ తిరువీధుల్లో అలంకార సేవను ఊరేగింపు నిర్వహించిన ఆచార్యులు తూర్పు రాజ గోపురం ముందు వేదికపై తీర్చిదిద్దారు. అర్చకులు, వేదపండితులు, రుత్విక స్వాములు అలంకారసేవ ముందు వేదపారాయణ పఠనం జరిగింది. వైదిక పర్వాలు దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో కొన సాగాయి. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఇన్‌చార్జి ఈవో ఎం. రామకృష్ణారావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఘట్టం

భక వత్సలా!.. శ్రీకృష్ణా ప్రభూ.. మమ్ములను రక్షింపనీవే సమర్థుడవు.. పాహిమాం ప్రభూ.. అంటూ గోపాలురులు స్వామివారిని వేడుకోగా జీవులను, వేదములను, ఇంద్రియములను సంరక్షించడం కోసం తన మహిమలను లోకానికి చాటిన ప్రత్యేక ఘట్టం గోవర్ధనగిరిధారి అలంకారం. పట్టు పీతాంబురాలు, చేతిలో పిల్లన గ్రోవి.. ఎడమచేతి చిటికెన వేలిపై గోవర్ధన పర్వతాన్ని స్వామి ధరించి తీరును అద్భుతమని, ద్వాపర యుగంలో నందుడి రాజ్యాన్ని అల్లకల్లోలం చేసేందుకు ఇంద్రుడి ఆజ్ఞ మేరకు అగ్నిదేవుడు కురిపించిన నిప్పుల వర్షం నుంచి గోకులాన్ని రక్షించిన తీరులో యాదాచలేశుడు తన ఆపన్న హస్తాలతో యావత్ భక్తజనావళిని రక్షిస్తున్నాడని అలంకార సేవ వైభవాన్ని ఆచార్యులు భక్తులకు వివరించారు.

సింహారూఢుడిగా తిరువీధుల్లో విహారం

దుష్ట శిక్షణ..శిష్ట రక్షణకు నృసింహుడిగా అవతరించిన స్వామివారు మృగరాజు సింహవాహనంపై భక్తుల పూజలు అందుకున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రాత్రి వేళ దివ్యవాహన సేవలు అందు కోవ డం ఆలయ సంప్రదాయం. దివ్యాభరణలతో తేజో రూపుడైన నారసింహుం డు అటవికే మహారాజైన సింహవాహనంపై అధిష్టించి దర్శనమిచ్చారు. .

శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ప్రభాతభేరి

స్థానిక శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతవేళ ప్రభాతభేరి కార్యక్రమం కొనసాగాయి. శ్రీవైష్ణవస్వాములు, రుత్వికులు లక్ష్మీనృసింహుడి కరావలంబ స్తోత్రం, విష్ణు సహస్రనామ పఠనాలతో తిరువీధుల గుండా ప్రదక్షిణంగా ప్రధానాలయంలోనికి చేరుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువుల సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు.


సింహవాహన అలంకార సేవోత్సవం

ప్రసాదాల తయారీ పరిశీలన

యాదగిరీశుడి పులిహోర ప్రసాదంలో ఎలుక ప్రత్యక్షమైనట్టు వచ్చిన వార్తలకు స్పందిస్తూ ప్రసాదాల తయారీని దేవాదాయశాఖ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణవేణి శనివారం పరిశీలించారు. ప్రసాదాల తయారీ, ప్యాకింగ్ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పులిహోర ప్రసాదం తయారీ మొత్తం యంత్రాల ద్వారా జరిగినా ప్యాకింగ్ మాత్రం శ్రీవైష్ణవ, బ్రాహ్మణ వంటస్వాములచే నిర్వహిస్తున్నట్టు గుర్తించినట్టు, నివేదిక అందజేయనున్నట్టు దేవస్థాన అధికారులు పేర్కొన్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీసాయిశ్రీనివాస భజన మండలి, శ్రీభక్తరామదాసు భజన మండలి, బూడిద సత్తయ్యబృందంచే భక్తి భజనలు, వింజమూరి విజయకుమారాచార్యులచే నృసింహతత్వంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం, పాల రామాంజనేయ భాగవతార్‌చే సీతాకల్యాణం హరికథా కాలక్షేపాలు, సాయంత్రం మహతీ ఆర్ట్స్ బృందంచే భక్తి సంగీత విభావరులు, భ్రమరాంబ, నాగదుర్గ, శ్రీసురభి అకాడమి ఆఫ్ పర్ఫార్మింగ్, కుమారి అంకం శిరీష, లాస్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఇతర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


సేవోత్సవంలో పాల్గొన్న చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు

స్వామివారి ఎదుర్కోళ్లు.. కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టాలైన స్వామి, అమ్మవార్ల ఎదుర్కోళ్ల మహోత్సవం, తిరుకల్యాణోత్సవాల నిర్వహణ కోసం దేవస్థాన అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రధానాలయ తూర్పు పంచతల రాజగోపురం ముందు గోల్డెన్ క్యూలైన్ ప్రాంతంలో స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు వేడుకలను నిర్వహించేందుకు వేదికను . కాగా ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవ వైదిక పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగనున్నాయి.

యాదగిరికొండపై భక్తుల సందడి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దేవదేవుడి దర్శనాల కోసం క్యూలైన్లలో బారులు తీరారు. భక్తుల సంచారంతో కొండకింద కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్‌స్టాండ్‌లు, కొండపైన ఆలయ తిరువీధులు, ఉభయ దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల తదితర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి. ధర్మదర్శనాలకు రెండు గంటలు, ప్రత్యేక దర్శనాల్లో గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 20వేల మంది యాదగిరిక్షేత్రాన్ని సందర్శించుకున్నారని, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.24,22,074 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్య పూజలు ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం, బిందెతీర్థంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వార బంధనం చేశారు. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వర స్వామికి, ముఖమండపంలో స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్యరుద్ర



హవనం, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రత పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. స్వామిని హైకోర్టు అడ్వకేటు జనరల్ ఎ సుదర్శన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలనంతరం ఆశీర్వచనం నిర్వహించారు.

రెండు గ్రామాల మధ్య చేపల చెరువు వివాదం

● చేపలు పట్టుకునే హక్కు ఇవ్వాలంటున్న సింగారం గ్రామస్థులు, ● మత్స్య సహకార సంఘం తమ గ్రామ పరిధిలో ఉందంటున్న చాడ గ్రామస్థులు

ఆత్మకూరు(ఎం) మార్చి 16: యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని సింగారం గ్రామస్థులు, మోటకొండూరు మండలం చాడ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యుల మధ్య చెరువులో పెంచిన చేపలు పట్టే విషయంలో వివాదం నెలకొంది. తమ గ్రామానికి చెందిన చెరువులోని చేపలు పట్టుకుంటామని సింగారం గ్రామస్థులు, మీకు హక్కు లేదని చాడ గ్రామానికి చెందిన మత్స్యకారుల మధ్య పంచాయితీ కొనసాగుతోంది. రెండు గ్రామాల మత్స్యకారుల వాదన ప్రకారం... మండలంలోని సింగారం గ్రామంలోని బండ చెరువులో మూడేళ్ల క్రితం ప్రభుత్వం చేప పిల్లలు వదిలింది. సింగారం బండ చెరువు చాడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో ఉంది. మూడేళ్లుగా మత్స్యకారులు చేపలు పట్టలేదు. చాడ గ్రామానికి చెందిన కొందరు మత్స్యకారులు మాస్కులు ధరించి, కర్రలతో ఈ నెల 12వ తేదీ రాత్రి సింగారం వచ్చారని గ్రామస్థులు అన్నారు. వారిని పట్టుకొని అదే రాత్రి గ్రామపంచాయతీ వద్దకు తీసుకొచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించామని గ్రామస్థులు తెలిపారు. తాము చెరువు కాపలా కోసం వస్తే పట్టుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో బంధించారని చాడ గ్రామ మత్స్యకారులు సింగారం గ్రామస్థులపై కేసు పెట్టారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. దీంతో చేపలు పట్టే విషయంలో వివాదం మరింత ముదిరింది.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సింగారం గ్రామస్థులు

మా చెరువులో చేపలు పట్టుకునే హక్కు మాకే ఇవ్వాలి

తమ ఊర్లోని చెరువులో చేపలు పట్టుకునే హక్కు మాకే ఇవ్వాలని సింగారం గ్రామస్థులు డిమాండ్ చేశారు. సుమారు 30మంది గ్రామస్థులు శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తమ గ్రామస్థులపై కేసులు ఎందుకు పెట్టారని ఎస్‌ఐ నాగరాజును ప్రశ్నించారు. గ్రామానికి వచ్చిన వ్యక్తులను గ్రామపంచాయతీ కార్యాలయంలో బంధించే హక్కు లేదని ఎస్‌ఐ వారితో అన్నారు. అనంతరం గ్రామస్థులు తహసీల్ధార్‌కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎలాంటి వనరులు లేవని, చేపలు అమ్ముకునే హక్కు తమకే కల్పించాలని డిమాండ్ చేశారు. తమ ఊరి చెరువులో పెంచిన చేపలను పక్క ఊరి వారు పట్టుకుపోతామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. మా ఊరి చెరువుపై హక్కులు కల్పించే వరకు పోరాడుతామన్నారు. ఎస్‌ఐ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ సఫియోద్దీన్ గ్రామపెద్దలకు నచ్చజెప్పె ప్రయత్నం చేసినా ఒప్పుకోలేదు. ఎస్‌ఐ, డీటీలు ఈ విషయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా చెరువులో చేపలు పట్టుకునే హక్కు మత్స్యకారులకు మాత్రమే ఉంటుందని గ్రామస్థులకు ఉండదని, ఈ విషయంపై గురువారం మాట్లాడుదామని చెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సఫియోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

వైద్యం వికటించి బాలుడు మృతి

హుజూర్‌నగర్, మార్చి 16: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటించి శనివారం బాలుడు మృతిచెందాడు. తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రి ఎదుట బాలుడి మృతదేహంతో ధర్నాకు దిగారు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఆరోపించారు. ఆసుపత్రి ఎదుట ధర్నా చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా కొద్దిసేపు ఆసుపత్రి ఎదుట ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే పెద్దమనుషులు సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన లొడంగి సాయికృష్ణ, శిరీష దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పెద్దకుమారుడు లొడంగి రితికొసిద్ధార్థ(5) విరేచనాలతో బాధపడుతుండగా బాలుడి తల్లిదండ్రులు ఆర్‌ఎంపీని సంప్రదించగా హుజూర్‌నగర్‌కు తీసుకెళ్లాలని ఆర్‌ఎంపీ సూచించారు. దీంతో శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం రితిక్‌సిద్ధార్థ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలుడి తండ్రి సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.


రితిక్‌సిద్ధార్థ మృతదేహం

మద్యం మత్తులో ఆటో డ్రైవర్ బీభత్సం

భువనగిరి టౌన్, మార్చి 16: మద్యం మత్తుతో డ్రైవర్ శనివారం రాత్రి భువనగిరిలో బీభత్సం సృష్టించాడు. స్థానిక తారకరామానగర్‌కు చెందిన వెంకటేష్ మద్యం సేవించి నడుపుతున్న ఆటో అదుపు తప్పి నల్లగొండ రోడ్డు వెంట గల శివనగర్‌లో రోడ్డు పక్కనే బైక్ ఆపి మాట్లాడుతున్న గాంధీనగర్‌కు చెందిన ఏ భానుపైకి దూసుకెళ్లింది. దీంతో భాను కాళ్లు విరిగాయి. అదే వేగంతో పక్కనే కుమ్మరివాడలోని రహదారి వెంట విక్రయానికి ఉంచిన కుండలపైకి దూసుకెళ్లింది. ఆటోను గమనించిన కుండల వ్యాపారి మరికొండ కవితతో పాటు కుండలు కొంటున్న మరో ఇద్దరు అప్రమత్తమై పరుగులు తీశారు. దీంతో పెను ముప్పు తప్పింది. అక్కడున్న యువకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన భానును జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ధ్వంసమైన కుండలు

చికిత్సపొందుతూ ఇద్దరు మృతి

వలిగొండ, చిట్యాల, మార్చి 16: చికిత్సపొందుతూ ఇద్దరు మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని మునగాల తుర్కపల్లి గ్రామానికి చెందిన బద్దం యాదమ్మ(70) పేరుమీద ఉన్న మూడెకరాల వ్యవసాయ భూమిని పెద్ద కోడలు స్వరూప, ఆమె మనుమడు రామిరెడ్డి పేర్ల మీదకు మార్చాలని మార్చి 12న కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. వృద్ధురాలిని మోత్కురులో తన కుమార్తె సువర్ణ ఇంటికి తీసుకెళ్లారు. 15వ తేదీ శుక్రవారం రాత్రి యాదమ్మ తీవ్ర అస్వస్థతకు గురికాగా మోత్కూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి మృతిచెందిదని ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపారు. యాదమ్మ చిన్న కుమారుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. నల్లగొండ జిల్లా చిట్యాల శివారులోని ఓ దాబహోటల్ వద్దకు ఈ నెల 14వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి భోజనం చేయడానికి వచ్చాడు. భోజనం చేస్తూ మూర్ఛ వ్యాధికి గురై కుర్చీలో నుంచి కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

చదువుకు తగిన ఉద్యోగం రాలేదని ఆత్మహత్య

నల్లగొండ టౌన్, మార్చి 16: చదువుకు తగిన ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గోలి వెంకన్న ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గోలి నాగరాజు(25) 2022లో బీటెక్ పూర్తిచేసి స్థానికంగా ఓ కారు షోరూంలో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సున్నిత మనస్కుడైన నాగరాజు తన చదువుకు తగిన ఉద్యోగం రాలేదని, భవిష్యత్‌లో కుటుంబాన్ని ఎలా పోషించాలని స్నేహితుల వద్ద బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో నాగరాజు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీ వెనకాల గల గ్రీన్‌హిల్స్ కాలనీ సమీపంలో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని తన స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకోగా అపస్మారకస్థితిలో ఉన్నాడు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. నాగరాజు తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. చిన్న కుమారుడు పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.


నాగరాజు(ఫైల్)

గడ్డి మందు తాగి యువకుడు..

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన నేవూరి నర్సిరెడ్డి, మాయమ్మ దంపతుల కుమారుడు నేవూరి మహిపాల్‌రెడ్డి(24) ఈ నెల 15న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతన్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడని ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మహిపాల్‌రెడ్డికి ఫిట్స్ వ్యాధి ఉండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని మేనమామ రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మహిపాల్‌రెడ్డి(ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

చిట్యాల, గరిడేపల్లి, మార్చి16: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. కరీంనగర్ జగిత్యాలకు చెందిన వనం రాములు(48) నల్లగొండ జిల్లా చిట్యాలలో ఉంటున్న తన కూతురిని చూడడానికి ఆయన భార్య వెంకటమ్మతో కలిసి చిట్యాలకు వచ్చాడు. టీ తాగుతానని శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన అతడు భువనగిరి రోడ్‌లో గల పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా చిట్యాల నుంచి భువనగిరి వైపు వెళుతున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాములు అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు. రాములు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా చిట్యాల జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట మండలంలోని సోలిపేట గ్రామానికి చెందిన తలారి రవి(30) మృతిచెందాడు. బైక్‌పై సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా చిట్యాల రైల్వేస్టేషన్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రవి అక్కడికక్కడే మృతిచెందాడు. రోడ్డు ప్రమాదంతో హైవేపై కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయింది.

మూలమలుపు వద్ద

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మఠంపల్లి మండలం బిల్యానాయక్ తండాకు చెందిన ధరవత్ నవీన్(21) సొంత పనుల నిమిత్తం గరిడేపల్లి నుంచి సూర్యాపేట వెళుతుండగా మండల పరిధిలోని మర్రికుంట గ్రామ సమీపంలో గల మూలమలుపు వద్ద రాగానే సూర్యాపేట నుంచి గరిడేపల్లి వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ధరావత్ నవీన్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేయగా క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ఏరియా హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ విషయంపై పోలీసులను సమాచారం కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మోతె: సూర్యాపేట జిల్లా మండల పరిధిలోని రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, 108సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన వి. అఖిల్ అతని స్నేహితుడు గోపీచంద్ కలిసి ఖమ్మం నుంచి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద ఉన్న ప్లైఓవర్ దిగుతుండగా వెనకాల నుంచి వస్తున్న హుస్సేనాబాద గ్రామానికి చెందిన ధన్యం లోడుతో సూర్యాపేటకు వెళుతున్న ట్రాక్టర్ బైక్ వెనకాల ఢీకొట్టడంతో రోడ్డు పక్కన పడిపోయారు. బైక్ ధ్వంసం కాగా అఖిల్ కాలు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గోపిచంద్ తలకు నడుముకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. ధ్వంసమైన బైక్‌ను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులు సేవాభావాన్ని కలిగి ఉండాలి


మొక్కలను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

హాలియా, మార్చి 16: విద్యార్థులు కళాశాల నుంచే సేవాభావాన్ని కలిగి ఉండాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నల్లగొండ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. మద్దిలేటి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాలియా విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా హాలియా మునిసిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో వారం రోజుల పాటు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్ అధ్యక్షతన మండల ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని ప్రజలు జలసంరక్షణ కోసం ఇంకుడుగుంతలు తీసుకునేలా ప్రోత్సహించాలని, పర్యావరణాన్ని పెంపొందించేందుకు చెట్లను పెంచేలా, పరిశుభ్రత వాతావరణంలో జీవించేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, కౌన్సిలర్ అనుపమనరేందర్‌రెడ్డి, సైదులు, సంగీతరావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ ఎంపీపీపై అవిశ్వాసం నోటీస్ జారీ

మర్రిగూడ, మార్చి 16: మర్రిగూడ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై ఈ నెల 30వ తేదీన అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు చండూరు ఆర్డీవో ఆదేశాల మేరకు శనివారం నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో మున్నయ్య తెలిపారు. 2023 జూలై 5వ తేదీన ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ఉన్నందున ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై బీఆర్ఎస్ అసమ్మతి ఎంపీటీసీలు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుత ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అవిశ్వాసంపై కోర్టుకు వెళ్లడం వల్ల అవిశ్వాస తీర్మానం వాయిదా పడింది. ఈ నెల 30వ తేదీన ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

మిర్యాలగూడ అర్బన్, మార్చి 16: డివిజన్ పరిధిలోని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శనివారం కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు దక్కేందుకు అధికారులు నిస్వార్థంతో కృషిచేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేలా గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేందుకు అధికారులు సంసిద్ధమై ఉండాలన్నారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

శాలిగౌరారం, మార్చి 16: పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల నియమావళిని అనుసరించాలని లేనియెడల చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.ఐలయ్య హెచ్చరించారు. తన సిబ్బందితో శాలిగౌరారంలో శనివారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయరాదని, బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయించవద్దని, రూ.50 వేల నగదు కంటే ఎక్కువ డబ్బులను సరైన ఆధారాలు లేకుండా తమతో తీసుకెళ్లరాదని సూచించారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వాహన పూజలకు ముగిసిన వేలం

● ఎల్లమ్మ ఆలయానికి రూ.9 లక్షల ఆదాయం

కనగల్, మార్చి 16: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఏడాది కాలానికి గాను వివిధ వస్తువిక్రయాలు, వాహన పూజ హక్కులను కల్పించటానికి శనివారం ఆలయ ప్రాంగణంలో అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. వాహన పూజలు బొట్లు పెట్టే హక్కులను దర్వేశిపురం గ్రామానికి చెందిన కాసర్ల వెంకటమ్మ రూ.9.20,016లకు వేలంపాడి హక్కులను పొందారు. అయితే తలనీలాలు, కొబ్బరిచిప్పల సేకరణ, మిఠాయిల అమ్మకం హక్కుల కోసం ఎవరూ వేలంలో పాల్గొనలేదు. త్వరలోనే సదరు వస్తు సేకరణలకు మరోసారి వేలం నిర్వహిస్తామని ఈవో జిల్లపల్లి జయరామయ్య, చైర్మన్ అల్లుబెల్లి నర్సింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్లు జినుకుంట్ల చంద్రయ్య లింగయ్య ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాల్వాయిలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

గుర్రంపోడు మార్చి 16: మండలంలోని పాల్వాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి అలివేలుమంగ సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ప్రసన్న ఆంజనేయస్వామి శ్రీకనకదుర్గాదేవి శ్రీసీతలపరమేశ్వర గ్రామదేవతల ఆలయంలో శనివారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, బాలునాయక్, నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, గాలి రవికుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి, సూదిని జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం నూతన పాలకమండలి ఎన్నిక

గట్టుప్పల్, మార్చి 16: మండలంలోని నామాపురం గ్రామంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయ పాలకమండలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఆలయంలో జరిగిన సమావేశంలో దేవాలయ ధర్మాదాయ శాఖ నల్లగొండ జిల్లా ఇన్‌స్పెక్టర్ సీరుడి సంతోష్‌రెడ్డి పర్యవేక్షణలో పాలకమండలిని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మర్రి దయాకర్, వైస్ చైర్మన్ గాశనగోని యాదయ్య కోశాధికారి మహేశ్వరం సురేష్, సభ్యులు మద్ది నరసింహ, జంపాల నరసింహ భీమనపల్లి లక్ష్మమ్మ, ఐతరాజు ఇంద్రమ్మ ఆదిశేఖర్ ఎన్నికయ్యారు. ఆలయ పూజారి మారేపల్లి రామాచార్యులు దేవాలయ ఆవరణలో నూతన మండలితో ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కంచుకట్ల సంపత్, మహేశ్వరం వెంకటేశ్వర్లు, మారోజు వెంకటేష్, జాజుల యాదయ్య, జనగాం యాదయ్య, జంపాల రమేష్, మర్రి యాదయ్య, సురిగి యాదయ్య, ఉపసర్పంచ్ జంగయ్య, వెంకటేశ్వర్లు ప్రకాష్, యాదయ్య, శ్రీనివాస్, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికం

● అరెస్టుపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

నల్లగొండ, హాలియా, దేవరకొండ, మిర్యాలగూడ అర్బన్, మార్చి 16: ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఎన్నికల నోటిఫికేషన్ సమయంలో తెలంగాణ ఆడబిడ్డను కావాలనే బీజేపీ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తుందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కవిత అరెస్టుకు నిరసిస్తూ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలు, పట్టణాలు, మండలాల్లో శనివారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. పలు చోట్ల ద్విచక్ర వాహన ర్యాలీలను నిర్వహించారు. రాజకీయ కుట్రలో భాగంగా ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేసిన ఈడీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయకక్షతోనే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని, బీజేపీ నీచరాజకీయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈడీ అధికారుల విచారణకు సహకరించిన కవితను అరెస్టు చేయమని మళ్లీ ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై కవితను అరెస్టు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

● నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడారు. అదానీకి శ్రీలంకలో దాదాపు ఐదారు వేల కోట్ల కాంట్రాక్టు ఇప్పించినందుకు మోదీని


దేవరకొండ: రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై కవితను అరెస్టు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కనగల్ ఎంపీపీ కరీం పాషా, నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, మాలే శరణ్యారెడ్డి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అభిమన్యు శ్రీనివాస్, యామ దయాకర్, వంగాల సహదేవరెడ్డి, నాగరత్నం రాజు, జలాలుద్దీన్, రంజిత్, దేవేందర్, లింగస్వామి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అయితగోని యాదయ్య, నాగేశ్వరరావు, లొడంగి గోవర్ధన్, వెంకన్న, జనార్దన్‌రావు, గోపి పాల్గొన్నారు.

● హాలియాలో సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈడీని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, వడ్డే సతీష్‌రెడ్డి, బిక్క్యానాయక్, జవ్వాజి వెంకటేశ్వర్లు, నల్లగొండ సుధాకర్, ఉర్లగొండ వెంకటేశ్వర్లు, రాంబాబు, నరేందర్, సైదాచారి, సైదులు, దుర్గారావు, కాశయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

● హాలియాలో బీఆర్ఎస్ యువత ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, వడ్డె సతీష్‌రెడ్డి, రావులపాటి ఎల్లయ్య, దొరేపల్లి వెంకటేశ్వర్లు, బండి రమేష్, అంజాద్‌ఖాన్, మక్బూల్, కృష్ణ, సైదులు, మార్క్, మల్లీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండ పట్టణంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయకక్షతోనే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని, బీజేపీ నీచ రాజకీయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ధర్నాతో ట్రాఫిక్ అంతరాయం కలగడంతో సీఐ నర్సింహులు రాస్తారోకో విరమించాలని నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో రవీంద్రకుమార్‌తో పాటు బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాజుల ఆంజనేయులు, రాజినేని వెంకటేశ్వరరావు, వల్లపురెడ్డి, ధస్రునాయక్, అంజిరెడ్డి, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం సాగర్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగా ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేసిన ఈడీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, నాయకులు మోసీన్‌అలీ, బాలాజీనాయక్, లలిత హతీరాం, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంపత్, వీరకోటిరెడ్డి, సైదులు, బాబయ్య, తిరుపతమ్మ, పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ: నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న భాస్కర్‌రావు


హాలియాలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం


శాలిగౌరారం: చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం


నకిరేకల్: సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

శాలిగౌరారం, మార్చి 16: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం అన్నారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన మేడి అంజమ్మకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును వారు అందజేసి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అత్యధికంగా సీట్లు లభిస్తాయన్నారు. ఎప్పుడు విరామం లేకుండా బిజీ షెడ్యూల్‌తో తిరిగే ఎమ్మెల్యే సామేల్ మండల కేంద్రంలోని రాజస్థాన్ టీ హోటల్ వద్ద శనివారం పావుగంట సేపు సరదాగా గడిపి ఉద్యమ సమయంలో జ్ఞాపకాలను నెమరవేసుకొని టీ తాగారు. ఈ సందర్భంగా హోటల్ సిబ్బంది సరదాగా మాట్లాడి వారితో ఫొటో దిగారు. హోటల్ యజమాని భీమారామ్, ఎమ్మెల్యే సామేల్‌కు రాజస్థాని తలపాగాను పెట్టి సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు మంగదుడ్ల శ్రీనివాస్‌యాదవ్, బెల్లి వీరభద్రం, భూపతి వెంకన్న, జయరాజు, శంకర్, వెంకటేష్, మేడి నాగరాజు, గోపి పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా ఆర్థిక భరోసా: ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్: అభాగ్యులకు అండగా ఆర్థిక భరోసాగా సీఎం రిలీఫ్‌ఫండ్ నిలుస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పన్నాలగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 44 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని, సీఎం రిలీఫ్‌ఫండ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, నకిరేకంటి యేసుపాదం, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, చౌగోని శ్రీను పాల్గొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వాసవీక్లబ్ ఇంటర్నేషనల్, వాసవీక్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గజ్జెల రామకృష్ణ, వాసవీక్లబ్ కపుల్స్ అధ్యక్షుడు గుండా న రేందర్, కార్యదర్శి వీరవెల్లి రఘునాథ్, కోశాధికారి బచ్చు శ్రీనివాసులు, బాలవరపు వెంకట శ్రీనివాస్, దేవరశెట్టి సత్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గోపలాయపల్లిపై

వైభవంగా సుదర్శన హోమం

నార్కట్‌పల్లి, మార్చి 16: మండలంలోని హరిహర క్షేత్రమైన గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతీ మాసం స్వామివారి జన్మ నక్షత్రమైన రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం ఇక్కడ సుదర్శన హోమాన్ని కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. యాజ్ఞికుడు ప్రతాపురం మత్స్యగిరిస్వామి ఆధ్వర్యంలో పూజాధికాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిడమనూరు మజీద్ కమిటీ అధ్యక్షుడిగా ఖలీల్ ఖురైసి

నిడమనూరు, మార్చి 16: నిడమనూరు మజీద్ ఖరీమియా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ ఖలీల్ ఖురైసి, ఉపాధ్యక్షుడు సయ్యద్‌పాషా, ప్రధాన కార్యదర్శి ఎస్‌డీ అబ్బాస్, కోశాధికారి ఎండీ జహంగీర్, సభ్యులుగా షేక్ అనీఫ్, షేక్ జహంగీర్, ఎండీ రశీద్, ఎండీ షంషు, ఎస్‌కే అబ్దుల్ సత్తార్, ఎస్‌కే జానీ, ఎస్‌కే హబీబ్, ఎస్‌కే ముజ్జు, ఎండీ హుస్సేన్ ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా ఎండీ గఫూర్, చోటేఖాజా, మౌలానాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బడుగులకు కాంగ్రెస్‌తోనే న్యాయం : జానారెడ్డి


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

కొండమల్లేపల్లి, మార్చి 16: బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కుందూరు జానారెడ్డి, ఆయన తనయులు సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాలన విధానాలకు ఆకర్షితులై వేర్వేరు పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కుందూరు రఘువీర్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొండమల్లేపల్లి మండలంలోని 9గ్రామపంచాయతీల బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. దీంతో మండలంలో బీఆర్ఎస్‌కు గట్టిషాక్ తగిలిందని పలువురు పేర్కొంటున్నారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో సుమారు 200 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, పస్నూరి యుగేంధర్‌రెడ్డి, ఎంపీటీసీ లక్కీదాస్, కైసర్‌ఖాన్, ఎంఏ. సిరాజ్‌ఖాన్, గంధం సురేష్, కోట్ల జగదీశ్, అందుగుల లింగయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీవెంకటేశ్వరస్వామి రథోత్సవం

డిండి, మార్చి 16: మండలంలోని దాసరినెమలిపూర్ గ్రామంలో కొలువైన లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. లక్ష్మీవేంకటేశ్వరస్వామిని గ్రామంలో రథంతో ఊరేగించారు. నెమలిపూర్‌లో నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మాధవరెడ్డి, నరేందర్‌రెడ్డి, రామచంద్రం, నర్సింహారావు, బాలయ్య, సిద్ధయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

రామగిరి, మార్చి 16: బీజేపీ పట్టణ శాఖ నూతన కమిటీని శనివారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా కంకణాల నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బద్దం నగేష్, గాలి శ్రీనివాస్, పగిడి నగేష్, ఉపాధ్యక్షులు మంగశపల్లి కిషన్, దాసరి సాయికుమార్, చర్లపల్లి గణేష్, అక్కనపల్లి బలరాం, బైరు సత్తయ్య, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, హైమావతి, కార్యదర్శులుగా దాసరి ఈశ్వర్, టంగుటూరి శ్యామ్, దశరథ, మహేష్, యాదగిరి, నాగరాజు, ప్రసాద్, కోశాధికారిగా నారని శ్యాం, ఉపకోశాధికారిగా భాస్కర్, సభ్యులను ఎన్నుకున్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో రాములు

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 16: పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో తరి రాములు అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో శనివారం ఇన్విజిలేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, ఆదర్శ పాఠశాల రెండు పరీక్ష కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పీఏపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 188 మంది, మోడల్ స్కూల్‌లో 148 మంది విద్యార్థులు మొత్తం 336 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ఉదయం 8.45 నుంచి విద్యార్థులను పరీక్ష హాలులోకి పంపనున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ పరీక్ష కేంద్రాలకు ముందుగా చేరుకుని ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. జడ్పీ హై స్కూల్ సీఎస్‌గా కృష్ణయ్య (పెద్దవూర), మోడల్ స్కూల్ సీఎస్‌గా సుదర్శన్‌రెడ్డి (పులిచర్ల) వ్యవహరించనున్నట్లు తెలిపారు.

● **నిడమనూరు:** రేపటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో బాలునాయక్ తెలిపారు. నిడమనూరు, ముకుందాపురం జడ్పీహైస్కూళ్లతో పాటు ఆదర్శ పాఠశాలలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 421 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ముగ్గురు చీఫ్ సూ పరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంట్ అధికారులు, 22 మంది ఇన్విజిలెటర్లను నియమించినట్లు ఆయన తెలిపారు.

● **కట్టంగూరు:** పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో నాగయ్య తెలిపారు. మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని జడ్పీహెచ్ఎస్ కట్టంగూరులో 140మంది, సాందీపని పాఠశాలలో 180మంది, గీతాంజలి పాఠశాలలో 115 మంది చొప్పున మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

● **కనగల్:** మండల కేంద్రంలో పది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పురుషోత్తంరెడ్డి తెలిపారు. మోడల్ స్కూల్ కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన 361 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ టౌన్: స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రంజాన్ మాసంలో సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ. సలీం ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి రూపొందించిన రంజాన్ మాస క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ వెంకటమ్మ నల్లగొండ ఆర్ఎం కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఏడాదికి పైగా నార్కట్‌పల్లి డిపోకు ఆమె ఇన్‌చార్జి డీఎంగా కొనసాగారు. కాగా నార్కట్‌పల్లి డిపో ఇన్‌చార్జి డీఎంగా నల్లగొండ డిపో డీఎం వ్యవహరించనున్నారు.

నార్కట్‌పల్లి: మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆసరా ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ భవిష్యత్తు ప్రణాళిక పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దామరచర్ల: రాజకీయ కుట్రలో భాగంగానే దామరచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేశారని పలువురు దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. మండలకేంద్రంలో ఆ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు మచ్చ ఏడుకొండలు, గోపాల్, దాను, శంభయ్యమాదిగ, సైదులు, సత్యం పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 41 రోజులు ఆమరణ నిరహారదీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. వాసవీక్లబ్, వాసవీవనితాక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మల్లయ్య, రమేష్, చీదేళ్ల వెంకటేశ్వర్లు, రవికుమార్, ఆంజనేయులు, సత్యం పాల్గొన్నారు.

దామరచర్ల: పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ జోన్ చైర్మన్ నకిరేకంటి సత్యనారాయణ, వాసవీ ఇంటర్నేషనల్ బాహుబలి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోటగిరి లక్ష్మణ్, ఏచూరి చిన్నకనకయ్య, దేవరశెట్టి భాస్కర్, చిట్టిపోలు నాగలక్ష్మి, మారం ప్రమీల, జ్యోతి, సైదయ్య, శ్రీను, హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: సైబర్ నేరాలు, ఈవిటీచింగ్, పోక్సో యాక్టుల పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని షీటీం ఎస్ఐ కోటేష్ అన్నారు. పట్టణంలోని సెంట్‌మేరి హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వీలైనంత మేరకు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం షీటీం పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు బిక్షం, షరీఫ్, మారయ్య, తబిత, ఫసీ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని సెంటీమేరి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థికి గాయం కావడానికి కారణమైన ఉపాధ్యాయుడు, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలమాల గోపిచంద్ డిమాండ్ చేశారు. పాఠశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా నిర్వహించారు. సెంటీమేరి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఆకాష్ అనే విద్యార్థి గత నెలలో ప్రమాదవశాత్తు కిందపడటంతో ఎడమచేయి విరిగిందని తెలిపారు. దీంతో చికిత్స అనంతరం ఆకాష్ ఈ నెల 14వ తేదీన పాఠశాలకు వచ్చాడని, పాఠశాల ఉపాధ్యాయుడు ఆకాష్‌ను గాయపరచడంతో దీంతో మళ్లీ ఆకాష్ చెయ్యి నొప్పి ఎక్కువై ఇబ్బందులు పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిపి పాఠశాల ఉపాధ్యాయుడు, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాకేష్, శ్రీకాంత్, తులసి పాల్గొన్నారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా విద్యార్థిపై ఉపాధ్యాయుడు చేయి చేసుకోలేదని, ఇన్ని రోజులు పాఠశాలకు ఎందుకు రాలేదని ప్రశ్నించినట్లు తెలిపారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలోని శిల్గాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో తరి రాము మాట్లాడుతూ విద్యార్థుల స్వపరిపాలన దినోత్సవం నిర్వహించడం వల్ల వారిలో భవిష్యత్తుపై పట్టుదల పెరిగి ఉన్నతంగా ఆలోచించి చదవడానికి వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్ఎం కట్టెబోయిన యాదయ్య బహుమతులు అందజేశారు.

మర్రిగూడ: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రణీత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్పుల యాదయ్య మాట్లాడుతూ ఆశావర్కర్లకు సంబంధించిన బిల్లులను వెంటనే అందజేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మర్రిగూడ: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం సాగుతుందని భీమనపల్లి మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని తొండల్‌వాయి గ్రామానికి చెందిన యువజన నాయకుడు బింగి మహేష్ గ్రామంలోని జడ్పీహైస్కూల్ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

చింతపల్లి: కాంగ్రెస్ సీనియర్ నేత తంగెళ్ల పెద్దలక్ష్మయ్య మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మండలంలోని హరిజనపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత తంగెళ్ల పెద్దలక్ష్మయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్య భార్యకు శస్త్రచికిత్స చేసిన అనంతరం ఓ అంబులెన్స్‌లో వచ్చి అంత్యక్రియలకు హాజరయ్యారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, నాయకులు కిన్నెర హరికృష్ణ, కొండల్‌యాదవ్, గిరి, నగేష్, వెంకులు ఉన్నారు.

మాడ్గులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 15 ఎంపీ సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని జడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి 5 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.